మహా సిటీ
నమస్తే NRI .నెట్
The Global Digital Telugu News Paper for NRI's
అక్టోబర్, 2026 సంపుటి 16 , సంచిక 5
www.namastenri.net
North America - Singapore - Dubai - UAE - UK - Malaysia - Australia.. etc

DSR BUILDERS & DEVELOPERS
THE TWINS By DSR



SKYMARQ
By DSR

DSR




3999 SFT 4999 SFT 5454 SFT
PREMIUM APARTMENTS

POSSESSION BY MARCH 2027

GHMC Building Permission
045981/ZOA/R1/U6/HMDA/25052021
TG RERA REGISTRATION
No. P02400005887
(www.rera.telangana.gov.in)

BOOK A
SITE VISIT TODAY
90549 54990

Site Address: DSR Skymarq, C932+PX5, Narsingi, Nanakramguda Service Rd, Financial District, Nanakramguda, Telangana 500075

Disclaimer: This advertisement is for marketing purposes only and does not constitute a legal offer.



# మహా సిటీ నమస్తే NRI .నెట్

The Global Digital Telugu News Paper for NRI's

అక్టోబర్, 2026 సంపుటి 16 , సంచిక 5

www.namastenri.net

North America - Singapore - Dubai - UAE - UK - Malaysia - Australia.. etc







మోదీ పాలనకు 25 ఏళ్ళు... 4వ పేజీలో...




మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన 7వపేజీలో...



శంకర నేత్రాలయ, ఖూజా దల్లాస్‌లో "అడాప్ట్-ఎ-విలేజ్" సాంస్కృతిక కార్యక్రమం విజయవంతం 5వ పేజీలో...




ఛార్లెట్‌లో తానా టీమ్ స్క్వేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమానికి భారీ స్పందన 10వ పేజీలో...



రాయలసీమ వీరులగాథ...రణబాలి 18వ పేజీలో...



ఆస్ట్రేలియాలో తొలి మహిళా మేయర్‌గా.. కర్రి సంధ్యారెడ్డి 15వ పేజీలో...

# మోదీ పాలనకు 25 ఏళ్లు...






గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తయ్యాయి. 2001లో భుజ్ భూకంపం, గుజరాత్ నుంచి ప్రారంభమైన ఆయన పాలనా ప్రయాణం.. 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జాతీయ స్థాయికి విస్తరించింది. మోదీ రాజకీయ ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబర్ 7న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు, ప్రధానమంత్రిగా కొనసాగుతూ.. ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నేతల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు. భారతదేశంలో, ఎన్నికైన ప్రభుత్వానికి అధిపతిగా సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును మోదీ ఇప్పటికే అధిగమించారు. గతంలో ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ నేత అయిన చామ్లింగ్ డిసెంబర్ 1994 నుంచి మే 2019 వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు సీఎంగా పనిచేశారు. దేశంలో సుదీర్ఘకాలం ముఖ్య మంత్రులుగా పనిచేసిన వారిలో ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతిబసు కూడా ఉన్నారు. బిజు జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు 24 సంవత్సరాల 99 రోజుల పాటు సీఎంగా సేవలందించారు. ఆయన తన స్వచ్ఛమైన ఇమేజ్, విపత్తు నిర్వహణ సామర్థ్యం, మహిళా సాధికారత కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక, సీపీఎం నేత జ్యోతిబసు జూన్ 1977 నుంచి నవంబర్ 2000 వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు.







పాలనను ప్రజాసేవకు సాధనంగా చూడటం తన ప్రయాణంలో ప్రధాన సిద్ధాంతంగా కొనసాగిందని ప్రధాని మోదీ చెబుతుంటారు. 2001 నుంచి 2012 మధ్య గుజరాత్ ఆర్థిక వ్యవస్థ సగటున దాదాపు 10 శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో జాతీయ సగటు 7.6 శాతంగా ఉంది. వ్యవసాయ రంగం కూడా 8 నుంచి 9 శాతం మధ్య వృద్ధి సాధించింది. 2003లో ప్రారంభమైన వైబ్రెంట్ గుజరాత్ సదస్సు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా నిలిచింది. దేశంలోని విదేశీ పెట్టుబడుల్లో గుజరాత్ వాటా 5 నుంచి 7 శాతం వరకు ఉంది. గుజరాత్ ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. సరిగ్గా 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తాను.. ఇన్నేళ్లుగా ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా న్నారు. ఇంత ఉన్నత స్థాయికి చేరుకుంటానని అప్పట్లో ఊహించ లేదని చెప్పారు. ప్రతి విజయం తనలో 'నేను ఏదైనా సాధించగలను' అనే నమ్మకాన్ని పెంచిందని తెలిపారు.

ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "దేశ ప్రజలకు తలవంచి నమస్కరిస్తున్నా. రాష్ట్ర ఎన్నికలైనా.. సాధారణ ఎన్నికలైనా ప్రజలు నాపై విశ్వాసం ఉంచారు. ఈ రోజు ఉదయం కూడా దేశ ప్రజలందరి కోసం వినాయకుడిని ప్రార్థించాను. ప్రజలకు సేవ చేసేందుకు మరింత శక్తిని ఇవ్వాలని కోరుకున్నా. నాకు ప్రజలే భగవంతుడి స్వరూపం. దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశమే నాకు ప్రథమ ప్రాధాన్యం" అని మోదీ పేర్కొన్నారు తనను తాను ఇప్పటికీ విద్యార్థిగానే భావిస్తానని మోదీ చెప్పారు. చిన్నప్పుడు వడోదరలో కాకుండా వద్నగర్‌లో పాఠశాలకు వెళ్లిన రోజుల్లో తరగతికి తొలుత వచ్చేవారిలో తానూ ఒకడినని గుర్తుచేసుకున్నారు. నేర్చుకోవాలన్న ఆసక్తి అప్పటి నుంచే తనలో భాగమైందన్నారు. "ఎంత ఎక్కువ నేర్చుకుంటే.. దేశానికి సేవ చేసే సామర్థ్యం అంత పెరుగుతుంది. ప్రతిరోజూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకోవడానికి ప్రయత్నిస్తా" అని చెప్పారు. తన 25 ఏళ్ల ప్రయాణంలో ఎదురైన ప్రతి సంకటం ఒక పాఠం నేర్పిందన్నారు. ప్రతి విజయం బాధ్యతను పెంచిందని, ప్రతి సాధన మరింత పెద్ద లక్ష్యాల వైపు వెళ్లేందుకు ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. మద్దతుదారులు తనకు ప్రోత్సాహాన్ని ఇస్తే.. విమర్శకులు తనను తాను పరిశీలించుకునేలా చేశారని పేర్కొన్నారు. గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ఎదురైన భుజ్ భూకంపం పునర్నిర్మాణంలో పట్టుదలగా ఉండటం నేర్పిందని మోదీ గుర్తుచేసుకున్నారు. చంద్రయాన్ వైఫల్యం నుంచి తిరిగి లేవడం నేర్చుకున్నానని తెలిపారు. కరోనా మహమ్మారి దేశ సమష్టి చైతన్యం, ఐక్యత ప్రాధాన్యాన్ని తెలియజేసిందన్నారు. తీపి, చేదు అనుభవాల మధ్య ముందుకు సాగేందుకు మీడియా కూడా తనకు ప్రేరణనిచ్చిందని పేర్కొన్నారు.

ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు బీజేపీ, రాజకీయ సహచరులు, తనపై విశ్వాసం ఉంచిన ప్రజలందరికీ మోదీ కృతజ్ఞతలు తెలిపారు. "సేవే ధర్మం. నేను యాంబిషన్ కోసం కాదు.. మిషన్ కోసం జీవిస్తున్నా" అని స్పష్టం చేశారు. వేల ఏళ్ల చరిత్ర, గొప్ప సాంస్కృతిక వారసత్వం ఉన్న దేశానికి సేవ చేసే అవకాశం తనకు లభించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. 25 ఏళ్ల ప్రస్థానం కేవలం గతాన్ని గుర్తుచేసుకునే సందర్భం కాదని.. భవిష్యత్తు కోసం సంకల్పాన్ని పునరుద్ఘాటించే సమయమని మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిస్తామని, ప్రపంచంలోని టాప్–3 ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు. "మనం సాధిస్తాం.. తప్పకుండా సాధిస్తాం" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.








# డిసెంబర్ 11 నుంచి ఖేలో ఇండియా



తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్నాయి. హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో మొత్తం 27 క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 7,500 మందికి పైగా యువ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. తెలంగాణను ప్రపంచస్థాయి క్రీడా కేంద్రంగా మార్చడంతోపాటు యువతను క్రీడల వైపు ఆకర్షించేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఆధునిక క్రీడా మైదానాలు, మెరుగైన శిక్షణ సదుపాయాలు, డిజిటల్ ఫిట్‌నెస్ కార్యక్రమాలతో క్రీడారంగాన్ని కొత్త దిశలో తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (వైఐపీఈఎస్యూ) వంటి సంస్థలకు ప్రాధాన్యం ఇస్తోంది. డిసెంబర్‌లో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. తెలంగాణకు రోయింగ్‌ను ఆతిథ్య క్రీడగా ఎంపిక చేశారు. సెయిలింగ్‌ను ప్రదర్శన క్రీడగా నిర్వహించనున్నారు. హనుమకొండలో అథ్లెటిక్స్, కరీంనగర్‌లో జూడో, ఖమ్మంలో ఆర్చరీ, మహబూబ్‌నగర్‌లో కబడ్డీ, నిజామాబాద్‌లో టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తారు. మిగిలిన పోటీలు హైదరాబాద్‌లో జరిగేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. గచ్చిబౌలి స్టేడియం, ఎల్‌బీ స్టేడియం, సరూర్‌నగర్, జేఎన్‌టీయూహెచ్, సికింద్రాబాద్‌లోని ఇండోర్ స్టేడియాలు, యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాలను పోటీలకు వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాబోయే రెండు నెలలు ఏర్పాట్లు పూర్తి చేయనున్నారు. హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంలో రోయింగ్, కయాకింగ్, కానోయింగ్ పోటీలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రాష్ట్రంలో ఘనంగా క్రీడలు నిర్వహించేందుకు ఐదు రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఆర్గనైజింగ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా, కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కో--చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. క్రీడాకారులు, అతిథుల వసతి, భోజనం, రవాణా ఏర్పాట్ల కోసం ప్రత్యేక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. డిసెంబర్ 11న గచ్చిబౌలి స్టేడియంలో ఈ వేడుకల ప్రారంబోత్సవం నిర్వహించే అవకాశముంది. డిసెంబర్ 22న ఎల్‌బీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ముగింపు కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# శంకర నేత్రాలయ, USA డల్లాస్‌లో "అడాప్ట్-ఎ-విలేజ్" సాంస్కృతిక కార్యక్రమం విజయవంతం




శంకర నేత్రాలయ, USA: డాల్లస్‌లో ఘనంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం: "అడాప్ట్-ఎ-విలేజ్" ప్రోగ్రామ్ ద్వారా 2,000 కంటి శుక్లం శస్త్రచికిత్సలకు నిధుల సమకూర్పు. టెక్సాస్‌లోని అర్వింగ్‌లో ఉన్న అర్వింగ్ ఆర్ట్స్ సెంటర్, శంకర నేత్రాలయ యుఎస్‌ఏ వారి 'మ్యూజిక్ ఒ డాన్స్ ఫర్ విజన్ 2026' కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చింది. ఈ కార్యక్రమం ఆ ప్రాంగణాన్ని సంస్కృతి మరియు కరుణల యొక్క ఉజ్వల ప్రదర్శనశాలగా మార్చింది. 300 మందికి పైగా హాజరైన ఈ కార్యక్రమం సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమైంది. మె-ంబైల్ ఐ సర్జికల్ యూనిట్ (MESU)కు మరియు గ్రామీణ భారతదేశంలో నివారించగల అంధత్వాన్ని నిర్మూలించే లక్ష్యానికి సమాజం అందిస్తున్న బలమైన మద్దతును ఈ కార్యక్రమం ప్రముఖంగా చాటింది. చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ చినసత్యం వీర్నపు మరియు బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు డాక్టర్ రెడ్డి ఊరిమిండి అందించిన ఆత్మీయ స్వాగతంతో ఈ సాయంకాల కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం, కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించిన శిరీష కోటమరాజు, ఎంతో హుందాగా మరియు కళాత్మకంగా కార్యక్రమాన్ని నడిపించారు.

సమన్విత మాడ ఆలపించిన అమెరికా, భారత జాతీయ గీతాల అనంతరం, కళ్లు చెదిరే భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో వేదిక కళకళలాడింది. సెంటర్ ఫర్ కూచిపూడి డాన్స్-టెక్సాస్, నాట్యోం డాన్స్ అకాడమీ, గురు పరంపర స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, నాట్యాంజలి కూచిపూడి డాన్స్ స్కూల్, రాగలీన డాన్స్ అకాడమీ, తాండవం-స్కూల్ ఆఫ్ కూచిపూడి, రాగమయూరి స్కూల్ ఆఫ్ డాన్స్ వంటి డల్లాస్-ఫోర్ట్ వర్త్ ప్రాంతంలోని నృత్య అకాడమీలు, సంప్రదాయం మరియు కథాకథనంలో పాతుకుపోయిన ఇతివృత్తాత్మక ప్రదర్శనలను అందించాయి. ప్రతి పాఠశాల పౌరాణిక కథల నుండి ఉత్సాహభరితమైన జానపద వ్యక్తీకరణల వరకు తమదైన ప్రత్యేకతను చాటుతూ, తమ సౌందర్యం, క్రమశిక్షణ మరియు అంకితభావంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. నృత్య ప్రదర్శనకారులందరినీ వేదికపై పతకాలతో, వారి గురువులను పుష్పగుచ్ఛం మరియు శాలువాతో సత్కరించారు.

బాల రెడ్డి ఇందుర్తి అధ్యక్షుడిగా ఎనిమిదేళ్ల నాయకత్వంలో, శంకర నేత్రాలయ యూఎస్ఏ ఏడు నగరాల నుండి ముప్పై నగరాలకు విస్తరించింది. అంతే కాక మొబైల్ కంటి శస్త్రచికిత్స యూనిట్ కార్యక్రమాన్ని రెండు ఆపరేటింగ్ యూనిట్ల నుండి ఐదుకు పెంచింది, మరో మూడు నిర్మాణంలో ఉన్నాయి. బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు డాక్టర్ రెడ్డి ఊరిమిండి, అడాప్ట్-ఎ-విలేజ్ కార్యక్రమం, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ (MESU) మరియు ఐదు వీజూఖ యూనిట్లలోని తాజా గణాంకాలపై ఒక అవలోకనాన్ని అందించారు. మహాదాతలైన ప్రకాష్ బెడపూడి, తిరుమల్ రెడ్డి కుంభం, శ్రీని వీరవెల్లి, సునీత & డాక్టర్ రాజు కోసూరి, అర్జున్ మదాడి (దివంగత తన భార్య భాను మదాడి జ్ఞాపకార్థం), మరియు కొత్త MESU అడాప్ట్-ఎ-విలేజ్ స్పాన్సర్లైన డాక్టర్ కృష్ణబాబు చుండూరి, జె.కె. రెడ్డి, FCA, భీమా పెంటా, సుధాకర్ గార్లంక, మరియు ప్రేమ్ కలిదిండి గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ అద్భుతమైన ఉదారత ఫలితంగా సుమారు 2,000 కంటిశుక్లం శస్త్రచికిత్సలకు అవసరమైన నిధులు పోగయ్యాయి. దృష్టి లోపంతో బాధపడుతున్న నిరుపేద వ్యక్తులకు ఇది జీవితాన్ని మార్చే చూపు అనే కానుకగా నిలిచింది. ప్రశంసలు, కృతజ్ఞతతో నిండిన ఒక క్షణంలో, ముఖ్య అతిథి, శంకర రత్న పురస్కార గ్రహీత శ్రీ ప్రసాద రెడ్డి కాటమ్‌రెడ్డి , బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు డాక్టర్ రెడ్డి ఊరిమిండి, డల్లాస్ చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ చినసత్యం వీర్నాపు , మరియు కమిటీ సభ్యులందరి సమక్షంలో సంఘ నాయకులు, ప్రాయోజకులు వేదికపై సత్కరించబడ్డారు

# మహా సిటీ

RNI APTEL/2010/34498
Voume:16 October : 2026 Issue:5



Chief Editor, Printer, Publisher
**Kalidevi Subba Rayudu**
mahacityeditor@gmail.com

Associate Editor
**Kalidevi Madhavi**

Manager Advertising
**K Pavan Kumar**
**M Venkat Rao**

Production
**Gokul Grapixs**
gokulgrapixs@gmail.com

**MAHA CITY**
D.No.22. Flat 101,
Madhuranagar, Ameerpet
Hyderabad-38

Printer
**Karshak Art Printers**
Vidya Nagar, Hyderabad-44


# ఆసియా క్రీడల్లో ప్రతిభ చాటిన భారత క్రీడాకారులు...ముగిసిన సంబరం




నాలుగేళ్లకోసారి జరిగే ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల సంబరం ముగిసింది. జపాన్ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివారం నిర్వహించిన ముగింపు వేడుకలు ప్రతి ఒక్కరినీ కట్టిపడేశాయి. ఏషియన్ గేమ్స్ ఆరంభానికి ముందు వసతి ఏర్పాట్లపై పెద్ద ఎత్తున చర్చ జరిగినా... క్రీడల సమయంలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్న నిర్వాహకులు అదే స్థాయిలో ముగింపు వేడుకలు నిర్వహించారు. 20వ ఆసియా క్రీడల్లో భారత్ 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో కలిపి మొత్తం 85 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. 2023లో హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా క్రీడలతో పోల్చుకుంటే భారత బృందం మెరుగైన ప్రదర్శన చేయలేకపోయినా... పట్టికలో నాలుగో స్థానాన్ని మాత్రం కాపాడుకుంది. ఇక వరుసగా 12వసారి ఆసియా క్రీడల్లో చైనా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 169 స్వర్ణాలు, 89 రజతాలు, 83 కాంస్యాలతో మొత్తంగా 341 పతకాలు ఖాతాలో వేసుకుంది. విదేశాల్లో జరిగిన ఆసియా క్రీడల్లో చైనాకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. ఆతిథ్య జపాన్ 269 పతకాలు (83 స్వర్ణాలు, 95 రజతాలు, 91 కాంస్యాలు), దక్షిణ కొరియా 150 పతకాలు (39 స్వర్ణాలు, 43 రజతాలు, 68 కాంస్యాలు) సాధించి వరుసగా రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. భారత్ ఆసియా క్రీడల్లో 1966, 1998, 2014, 2023లలో స్వర్ణాలు సాధించింది. తాజా విజయంతో మన టీమ్ 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు కూడా నేరుగా అర్హత సాధించింది. గత రెండు ఒలింపిక్ క్రీడల్లో భారత్ వరుసగా కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన పురుషుల జట్టుకు హాకీ ఇండియా (హెచ్ఐ) నజరానా ప్రకటించింది. ఒక్కో ఆటగాడికి రూ.11 లక్షలు చొప్పున, సహాయక సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ. 5.50 లక్షల చొప్పున అందించనుంది. గత ఆసియా క్రీడల్లో పతకాల శతకం నమోదు చేసిన భారత్... తాజా ఏషియన్ గేమ్స్‌లో మాత్రం సెంచరీకి చేరువగా రాలేకపోయింది. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తంగా 85 పతకాలు సాధించింది. భారత్‌తోపాటు ఉజ్బెకిస్తాన్ కూడా 21 స్వర్ణాలు సాధించినా... రజత, కాంస్య పతకాల్లో భారత్‌దే పైచేయి కావడంతో గత నాలుగో స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది.

# ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



ఇటీవల జపాన్ లో జరిగిన ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. రాష్ట్రం నుండి ఎక్కువ మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించేలా ప్రోత్సాహం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

2026 ఆసియా క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన క్రీడాకారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. క్రీడాకారులు శ్రీ చరణి, గణేష్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ సచివాలయంలో సీఎంను కలిశారు. క్రీడాకారులు సాధించిన పతకాలు చూసి, వారి అత్యుత్తమ ప్రదర్శనను సీఎం కొనియాడారు. మొత్తంగా 3 రకాల క్రీడాంశాల్లో 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో సహా మొత్తం 8 పతకాలను మన రాష్ట్ర క్రీడాకారులు కైవసం చేసుకున్నారని సీఎంకు శాప్ ఎండీ శ్రీమతి భరణి వివరించారు.











# మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన

మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన కార్యక్రమంలో నేడు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కే అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, రాంప్రసాద్ రెడ్డి, బీ సి జనార్ధన్ రెడ్డి,నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, రిలయెన్స్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, పలువురు మంత్రులు, అధికారులు కూడా పాల్గొన్నారు. నారా లోకేష్ మాట్లాడుతూ: హైదరాబాద్‌లో ఐఎస్ బి తరహా మ్యాజిక్ ఇప్పుడు రాయలసీమలో జరగబోతుంది. ఇక్కడకు రాబోయే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (GHH) – ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ISA) వ్యవసాయరంగ రూపురేఖలు



మార్చబోతోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మంత్రి లోకేష్ హాజరయ్యారు. విత్తనం దగ్గర నుండి, ఉత్పాదకత, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, యాంత్రీకరణ, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వరకు ఇక్కడ రీసెర్చ్ జరుగుతుంది. ఇక్కడ పండించిన పండ్ల ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసినప్పుడే మన రైతులకు లాభం వస్తుంది. హార్టికల్చర్ హబ్ లక్ష్యం రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే. మనం కేవలం ఇతర రాష్ట్రాలకు కావాల్సిన వెరైటీలే కాకుండా ఇతర దేశాలకు అవసరమైన రకాల పంటలు కూడా పండించాలి. అందుకు అనుగుణంగా మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి ప్రతి వెరైటీకి సంబంధించి రీసెర్చ్ జరగాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి సత్తా చూపిస్తాం...

రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు అధికార కూటమి కార్యాచరణను వేగవంతం చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో స్థానిక ఎన్నికల వ్యూహాలు, కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై సమగ్రంగా చర్చించారు. అంతకు ముందు చంద్రబాబుతో కలిసి పవన్ కల్యాణ్ అల్పాహార విందులో పాల్గొన్నారు. అనంతరం ప్రధానంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. కూటమిలోని పార్టీల మధ్యస్థానాల సర్దుబాటు, ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలనే అంశంపై చర్చించారు. ప్రాధాన్యత కలిగిన కీలక కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థు లుగా ఎవరినినిలబెట్టాలనే దానిపై ప్రాథమిక అభిప్రాయానికి వచ్చారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించారు. స్థానిక పోరులో కూటమి ఐక్యతను చాటుతూ, అన్ని స్థాయిలోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా నాయకులు ఈ వ్యూహరచన చేశారు.--మా సంకల్పం గట్టిది. కూటమికి తిరుగులేదు. మళ్లీ మళ్లీ కూటమి ప్రభుత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారు.-- అని సీఎం చంద్రబాబు



వ్యాఖ్యానించారు. కడప జిల్లా పొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ 2.0 అమరజీవి జలధార కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. గట్టి సంకల్పం కేంద్ర సహకారంతో గడచిన 28 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేయగలిగామన్నారు. రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల అభివృద్ధి కోసం గడచిన 7 రోజుల్లోనే 9 కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.



# 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు నాయుడు

25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అరుదైన ఘనత సాధించిన ఆయన సేవలను ఢిల్లీ లో కలిసిన సందర్భంగా కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని చూపారని, క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారని అన్నారు. దూరదృష్టి, స్పష్టమైన లక్ష్యం, ధృడమైన నిర్ణయాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా మలిచారని కీర్తించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో భారత దేశ గమనాన్ని మర్చారని సిఎం అన్నారు. ముఖ్యంగా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసి వికసిత్ భారత్ వైపు దేశాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ గౌరవాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేలా తోడ్పడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రజల తరుపున ఈ సందర్భంగా ప్రధానికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు.



# విదేశాల్లో ఘనంగా బతుకమ్మ మరియు దసరా సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ. పూలను అందంగా పేర్చి గౌరమ్మను పూజిస్తూ మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకుంటారు. విదేశాల్లో కూడా ఈ బతుకమ్మ పండుగను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రకృతిని ఆరాధిస్తూ, కుటుంబ సౌభాగ్యం, ఆరోగ్యం, సంతోషం కోసం ప్రార్థించడం బతుకమ్మ పండుగ ప్రత్యేకత. సాధారణంగా తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకలో ప్రతి రోజుకు ఒక ప్రత్యేకమైన పేరు, నైవేద్యం ఉంటాయి. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు, స్థానిక పూల వైవిధ్యానికి ప్రతీక. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలతో బతుకమ్మలను అలంకరిస్తారు. సంప్రదాయ పాటలు, ఆటలు, పూజలతో గ్రామాలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదు; తెలంగాణ వారసత్వాన్ని, సంస్కృతిని తరువాతి తరాలకు పరిచయం చేసే గొప్ప సంప్రదాయం కూడా.

**ఎంగిలిపూల బతుకమ్మ ఇది పండుగ ప్రారంభానికి సూచికగా నిలుస్తుంది. రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ, బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. మహిళలు అందమైన పూలతో పెద్ద బతుకమ్మలను పేర్చి సామూహికంగా పాటలు పాడుతారు. సంప్రదాయం ప్రకారం ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం బతుకమ్మలను చెరువులు, నీటి వనరుల వద్ద నిమజ్జనం చేస్తారు.**



దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవ రోజు విజయ దశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు.

బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఆలయాలలో అమ్మవారికి ఒక్కోరోజు ఒక్కో అలంకారం చేస్తారు. పదవరోజు దసరా పండుగ 'విజయదశమి' జరుపుకోవడం జరుగుతుంది. ముందు నవరాత్రులు దుర్గ పూజ ఉంటుంది. విజయ దశమి 'దసర' చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారు. జగన్మాత అయిన దుర్గా దేవి మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి విజయాన్ని పొందిన సందర్భమున 10వ రోజు ప్రజలంతా సంతోషముతో ఈ పండగ జరుపుకున్నారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణునిపై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు.










































# తానా(TANA)ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతలు మరియు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో దుబ్బాకలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తానా ఫౌండేషన్ ప్రధాన సమన్వయకర్తగా దుబ్బాక పట్టణంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించింది. దివ్య సుగూర్, అనీష్ సుందర్, సుందర్ గోపినాథ్ ఈ శిబిరానికి ఆర్థిక సహకారం అందించగా, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వైద్య సేవలను అందించింది. గాడిపల్లి ఫౌండేషన్ స్థానికంగా సహకరించింది.

ఈ కార్యక్రమాన్ని తానా న్యూజెర్సీ కోఆర్డినేటర్ సుధీర్ నరేపలుపు, తానా కోశాధికారి రాజా కసుకుర్తి, తానా ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేక సమన్వయం చేశారు. వర్ష నరేపలుపు వాలంటీర్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించి స్వచ్ఛంద సేవకులను సమన్వయం చేశారు. వివిధ సంస్థలు, వైద్య బృందాలు, స్థానిక ప్రతినిధులను సమన్వయం చేస్తూ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో వీరంతా కీలక పాత్ర పోషించారు.

ఈ వైద్య శిబిరానికి దుబ్బాక పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్య సిబ్బంది క్యాన్సర్‌కు సంబంధించిన ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాల్సిన ఆవశ్యకత, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రముఖ నాయకుడు, గాడిపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ పేద ప్రజలకు సేవ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో గాడిపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పేద ప్రజలకు ఆర్థిక లేదా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, వారికి సాధ్యమైనంత సహాయం




అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు.

తానా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ నల్లూరి, తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి తోడ్పడే కార్యక్రమాలకు తానా ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. గతంలో మాదిరిగానే భవిష్యత్తులోనూ గ్రామీణ సమాజాలకు ప్రయోజనం చేకూర్చే మరిన్ని వైద్య, ఆరోగ్య అవగాహన మరియు సేవా కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు.

శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన అనీష్ సుందర్, దివ్య సుగూర్, సుందర్ గోపినాథ్, వైద్య సేవలు అందించిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, స్థానికంగా సహకరించిన గాడిపల్లి ఫౌండేషన్, వైద్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు మరియు స్థానిక ప్రజలకు తానా

# ఛార్లెట్ లో హిందూ సంప్రదాయాలపై పిల్లలకు అవగాహన సదస్సులు విజయవంతం

హిందూ సంప్రదాయాలు, ఆచారాల వెనుక ఉన్న శాస్త్రీయత, తాత్వికతను పిల్లలకు పరిచయం చేసేలా ఛార్లెట్, నార్త్ కరోలినాలో ఇటీవల ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. నార్త్ కరోలినా స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్ (ఎన్‌సీఎస్ఎస్ఎం) డర్హమ్‌లో సీనియర్‌గా చదువుతున్న రిషి జాస్తి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. "రిచువల్స్ అండ్ రీజన" (ఆచారం వెనుక ఉన్న కారణాలు) పేరుతో నిర్వహించిన ఈ ప్రత్యేక సదస్సుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), శ్రీ సాయి గురుదేవ దత్త మందిర్ (హంటర్స్‌విల్, నార్త్ కరోలినా), గ్రేటర్ ఛార్లెట్ ప్రాంత తెలుగు సంఘం (టాగ్కా) సహకారం అందించాయి. అలాగే ఛార్లెట్‌కు చెందిన కొందరు వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌షిప్ అందించారు. హిందూ ఆచార వ్యవహారాల వెనుక ఉన్న శాస్త్రీయ, తాత్విక కోణాలను హైస్కూల్ విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

జూలై 25 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాక్స్‌హా, నార్త్ కరోలినాలోని చిమ్నీస్ ఆఫ్ మార్విన్ కమ్యూనిటీ సెంటర్‌లో ఈ సదస్సులు జరిగాయి. తొమ్మిది తరగతి నుంచి






పై తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు ఇందులో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సదస్సులో విద్యార్థులు ఆచార వ్యవహారాలను కేవలం సంప్రదాయాలుగా కాకుండా, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ, తాత్విక కారణాలను అర్థం చేసుకునేలా ప్రత్యేకంగా శిక్షణ పొందారు. యువ కార్యక్రమంలో భాగంగా బోధించిన హిందూ తాత్విక సంప్రదాయాలను లోతుగా అధ్యయనం చేసేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే "రీజన్ అండ్ రేషనాలిటీ" అనే తత్వశాస్త్ర కార్యక్రమం నుంచి ప్రేరణ లభించింది.

ముగింపు రోజున పిల్లలు, పెద్దలు అందరికీ అందుబాటులో ఉండేలా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 75 మందికి పైగా పిల్లలు, పెద్దలు హాజరయ్యారు. ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీ అండ్ రిలిజియన్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న సాగర్ రావు ప్రత్యేక అతిథిగా పాల్గొని, విద్యార్థులతో పాటు అక్కడ ఉన్న పిల్లలు, పెద్దలతో కూడా ముచ్చటించారు. ఈ సందర్భంగా అందరూ తమకు సంబంధించిన సందేహాలను ఆయనతో చర్చించి, పలు అంశాలపై అవగాహన పొందారు.

ఈ కార్యక్రమం పూర్తిగా ఉచితంగా నిర్వహించబడింది. అనూహ్యమైన స్థాయిలో స్పందన లభించడంతో మొత్తం 30 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఇందులో భాగంగా రిషి జాస్తి ఈ కార్యక్రమానికి ముందు నుంచే ప్రత్యేకంగా విరాళాలు సేకరించి, కమ్యూనిటీ కార్యక్రమం జరిగిన రోజున శ్రీ సాయి గురుదేవ దత్త మందిర్ (హంటర్స్‌విల్, నార్త్ కరోలినా)కు నిరుపేదలకు ఆహారం అందించే కార్యక్రమం కోసం 300 డాలర్లు అందించారు. ఈ మందిరం ప్రతి గురువారం 1000 మందికి పైగా భక్తులకు మరియు నిరుపేదలకు మహాప్రసాదం అందిస్తోంది. హిందూ సంప్రదాయాలను లోతుగా అధ్యయనం చేసి, ప్రశ్నించి, నేర్చుకోవాలనుకునే యువతకు ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన అవకాశంగా నిలిచిందని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రిషి జాస్తి తెలిపారు.



# ఛార్లెట్‌లో తానా టీమ్ స్క్వేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమానికి భారీ స్పందన




ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో నార్త్ కరోలినాలోని ఛార్లెట్‌లో తానా టీమ్ స్క్వేర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె రన్ కార్యక్రమానికి భారీ స్పందన వచ్చింది. దాదాపు 400మందికిపైగా పిల్లలు, పెద్దలు అందరూ హాజరై విజయవంతం చేశారు. సెప్టెంబర్ 20, ఆదివారం ఉదయం ఫ్రాంక్ లిస్కే పార్క్ లో జరిగిన ఈ కార్యక్రమానికి తానా నాయకులు పలువురు హాజరయ్యారు. వచ్చినవారికి రుచికరమైన దక్షిణ భారత అల్పాహారం అందించారు. ఉచిత టీ షర్టులు, విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. తానా టీమ్ స్క్వేర్ నిధుల సేకరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, మాజీ అధ్యక్షుడు అంజయ్య చౌదరి లావు, జాయింట్ ట్రెజరర్ రాజేష్ యార్లగడ్డ, ఫౌండేషన్ ట్రస్టీ మధుకర్ యార్లగడ్డ, సౌత్ ఈస్ట్ ప్రాంతీయ ప్రతినిధి శేఖర్ కొల్లు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా తానా నాయకులు మాట్లాడుతూ, తానా టీమ్ స్క్వేర్ నిధుల సేకరణలో భాగంగా మొదటి కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని, ఇదే విధంగా ఇతర నగరాల్లో కూడా నిర్వహిస్తామన్నారు. తానా టీమ్‌స్క్వేర్ ద్వారా చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

ఈ కార్యక్రమానికి యాంకర్ గా సౌమ్యశ్రీ తలంకి వ్యవహరించారు. జూంబా ఇన్‌స్ట్రక్టర్ మౌనిక కావలి కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మార్గదర్శకులుగా మారథాన్ రన్నర్, తానా కమ్యూనిటీ సర్వీస్ అవార్డు గ్రహీత అయిన నవీన్ అప్పలనేని వ్యవహరించారు. ఆయన అంకితభావం, నాయకత్వం అందరికీ మార్గదర్శనంగా నిలిచింది.

తానా ఛార్లెట్ నాయకులు తానా టీమ్ స్క్వేర్ చైర్మన్ కిరణ్ కొత్తపల్లి, తానా అప్పలాచియాన్ ప్రాంతీయ ప్రతినిధి రవి (నాని) వడ్లమూడి, స్పెషల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నాగ పంచుమర్తి, హెల్త్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ మాధురి ఏలూరి, ఫౌండేషన్ ట్రస్టీ ఠాగూర్ మల్లినేని, పట్టాభి కంఠంనేని తదితరులు ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేశారు. రన్ తర్వాత జరిగిన సమావేశంలో తానా నాయకులు మాట్లాడారు. తానా టీమ్ స్క్వేర్ ద్వారా తానా చేస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ, వాలంటీర్లకు, స్పాన్సర్లకు తానా నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



# తానా (TANA) క్లీవ్‌ల్యాండ్ నాయకత్వంలో ఘనంగా టీమ్ స్క్వేర్ 5కే రన్/వాక్




ఆరోరా, ఓహాయో: తానా క్లీవ్‌ల్యాండ్ నాయకత్వ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన టీమ్ స్క్వేర్ 5కే రన్/వాక్ కార్యక్రమం ఆరోరాలోని సన్నీ లేక్ పార్క్లో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. క్లీవ్‌ల్యాండ్ ప్రాంతానికి చెందిన తెలుగు కుటుంబాలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తానా క్లీవ్‌ల్యాండ్ నాయకత్వ బృందం పంగులూరి రామారావు నాయకత్వంలో కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించింది. ఆరోగ్యం, సేవాభావం, సామాజిక ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతో జరిగిన ఈ కార్యక్రమం ఉదయం యోగా కార్యక్రమంతో ప్రారంభమై, అనంతరం 5కే రన్/వాక్ మరియు చిన్నారుల కోసం ప్రత్యేక వినోద కార్యక్రమాలతో కొనసాగింది. పిల్లల కోసం ముఖ చిత్రలేఖనం మరియు ఇతర వినోద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి తానా రీజినల్ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ చందనం మరియు తానా ఓహాయో వ్యాలీ టీమ్ స్క్వేర్ చైర్ వేణు తలశిల వ్యక్తిగతంగా హాజరై నిర్వాహకులను, వాలంటీర్లను మరియు పాల్గొన్న వారిని అభినందించారు. వారి హాజరు కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చింది.

కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో క్లీవ్‌ల్యాండ్ నాయకత్వ బృందానికి చెందిన లక్ష్మి యార్లగడ్డ, సుహాసిని అడ్డగడ, దుర్గా ప్రసాద్ చెట్టిభక్తుని, నరేష్ బొడ్డు, సతీష్ దంతులూరి మరియు ప్రియాంక యడ్లపల్లి కీలక పాత్ర పోషించారు.

రిజిస్ట్రేషన్, రన్ మార్గం నిర్వహణ, వేదిక మరియు ధ్వని ఏర్పాట్లు, యోగా కార్యక్రమ సమన్వయం, పిల్లల కార్యక్రమాలు, ఆహార ఏర్పాట్లు, అతిథుల స్వాగతం, ఫోటోగ్రఫీ, ప్రాంగణ ఏర్పాట్లు మరియు కార్యక్రమం అనంతర శుభ్రపరిచే పనుల వరకు అనేక బాధ్యతలను నాయకత్వ బృందం మరియు వాలంటీర్లు సమర్థవంతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మహేష్ అడ్డగడ, రాధ తాళ్లూరి, యువరాజ్ పంగులూరి, తాజుల్ షేక్, రామారావు అప్పన, సరిత చిన్నం, రాజా అబ్బెన్నగారి, అభయ్ గైక్వాడ్, ఆర్.కే. వెలగా, రాజ్ తీగల, సంగీత తీగల, సంతోష్ కేసిరెడ్డి, సతీష్ కడియాల, శ్రీకాంత్ రెడ్డి, రమణ ఈర్ల, అంజలి పంగులూరి, చెష్విక్ అడ్డగడ, శంకర్ తదితర వాలంటీర్లు విశేషంగా సేవలందించారు. ఉదయం నుంచే కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాట్లు చేయడం నుంచి కార్యక్రమం ముగిసే వరకు వారి సమిష్టి కృషి ఈ కార్యక్రమ విజయానికి ప్రధాన బలంగా నిలిచింది.

ఈ కార్యక్రమానికి మద్దతు అందించిన జాతీయ ప్రాయోజక సంస్థ ఎక్స్‌పాట్ మనీ, అలాగే ఆస్పెన్ డెంటల్ మరియు రాజ్‌ఎగ్జిమ్ గ్లోబల్ సంస్థలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే యార్లగడ్డ కుటుంబం, వెలగా కుటుంబం, పంగులూరి కుటుంబం మరియు మెదరమెట్ల కుటుంబం కుటుంబ ప్రాయోజకులుగా అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి భాగస్వామ్య సంస్థలుగా నీయోటా, సప్తస్వర అకాడమీ, శ్రీ మయూరి డాన్స్ అకాడమీ, నర్తనం డాన్స్ అకాడమీ, సాన్స్ డాన్స్ వైబ్స్ మరియు మిరాకిల్ మైండ్ సహకరించాయి. ఈ సంస్థల భాగస్వామ్యం కార్యక్రమానికి మరింత విస్తృతమైన సామాజిక మద్దతును అందించింది.



# ఫిలడెల్ఫియా: తానా(TANA)మిడ్-అట్లాంటిక్ సమ్మర్ చెస్ టోర్నమెంట్- 2026కు విశేష స్పందన

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ విభాగం నిర్వహించిన సమ్మర్ చెస్ టోర్నమెంట్ కు భారీ స్పందన వచ్చింది. సెప్టెంబర్ 12న ఫిలడెల్ఫియాలోని ఎక్టన్ లో నిర్వహించిన ఈ చెస్ టోర్నమెంట్లో 100 మందికి పైగా ఆటగాళ్ళు పాల్గొన్నారు. ఇందులో సగానికిపైగా ఆటగాళ్ళు యుఎస్ చెస్ ఫెడరేషన్ రేటెడ్ ఆటగాళ్లు కావడం విశేషం. పోటీతత్వం, నేర్చుకునే తపన, క్రీడాస్ఫూర్తిని ఈ సందర్భంగా ఆటగాళ్ళు కనబరిచారు.

ఈ టోర్నమెంట్‌ను అత్యంత నైపుణ్యం, ఖచ్చితత్వం మరియు అంకితభావంతో నిర్వహించిన ట్రై-బ్రిడ్జెస్ చెస్ క్లబ్ టోర్నమెంట్ డైరెక్టర్ జాషువా ఆండర్సన్ కు తానా నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. చెస్ టోర్నమెంట్ నిర్వహణలో ఆయనకు ఉన్న అనుభవం, అంకితభావం ఈ టోర్నమెంట్లో పాల్గొన్నవారికి ప్రత్యేకమైన అనుభూతిని అందించింది. ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన నాయుడమ్మ యలవర్తి, ప్రసాద్ కస్తూరి, సురేష్ యలమంచి, కృష్ణ నందమూరి, శ్రీధర్ సాదినేని, రంజిత్ మామిడి, చలం పావులూరి, వ్యోమ్ క్రోతపల్లి మరియు ధీరజ్ యలమంచికి కూడా తానా టీమ్ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పింది.





తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కోడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, బోర్డు డైరెక్టర్ రవి పొట్లూరి, మిడ్-అట్లాంటిక్ రీజినల్ ప్రతినిధి ఫణి కంతేటి, బెనిఫిట్స్ కోఆర్డినేటర్ వెంకట్ సింగు మరియు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ చావ ఈ టోర్నమెంట్ నిర్వహణకు తమవంతుగా మద్దతును అందించారు. ఈ టోర్నమెంటులో పాల్గొన్న ఆటగాళ్ళకు, వలంటీర్లకు ఇతరులకు తానా మిడ్ అట్లాంటిక్ టీమ్ తరపున అభినందనలు తెలియజేశారు.

| రేటెడ్ ఓపెన్ విజేతలు | అండర్ 900 రేటెడ్ విజేతలు | అండర్ 500 రేటెడ్ విజేతలు | K8 అన్‌రేటెడ్ విజేతలు | 9-12 (పెద్దలతో కలిపి) అన్‌రేటెడ్ విజేతలు |
|---|---|---|---|---|
| ఫస్ట్ ప్లేస్- సాయి రేయాన్ష్ నగిశెట్టి | ఫస్ట్ ప్లేస్-- ప్రణవ్ కంతేటి | ఫస్ట్ ప్లేస్ --- బోధి రాయ్ | ఫస్ట్ ప్లేస్ --కుశాల్ తడువాయి | ఫస్ట్ ప్లేస్--- సునీల్ కొత్త |
| సెకండ్ ప్లేస్- హైంధవ్ మురుగేష్ | సెకండ్ ప్లేస్- కార్తికేయ కుర్చర్లపాటి | సెకండ్ ప్లేస్--విదిత్ కువేల్కర్ | సెకండ్ ప్లేస్--శ్రీయాన్ వజ్రాల | సెకండ్ ప్లేస్- పునీత్ మద్ది |
| 3వ ప్లేస్-- యువిన్ శ్రీనివాసన్ | 3వ ప్లేస్-- రిధిక అరవిందకుమార్ | 3వ ప్లేస్--- నంద వి మేలం | 3వ ప్లేస్-- అడ్రియన్ బెన్సన్ | 3వ ప్లేస్-- జీవన్ మత్రిబోయిన |

## చెస్ క్రీడాకారులకోసం తానా మిడ్ అట్లాంటిక్ శిక్షణా కార్యక్రమం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ విభాగం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. క్రీడాకార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ వివిధ పోటీలను ఇతర కార్యక్రమాలను తానా మిడ్ అట్లాంటిక్ ఏర్పాటు చేస్తోంది. తాజాగా ఎలైట్ బ్రెయిన్స్ చెస్ కోచింగ్ ప్రోగ్రామ్ ను ప్రారంభించింది. 4వారాలపాటు జరిగే ఈ శిక్షణకోర్సును సెప్టెంబర్ 26న ప్రారంభించారు. అక్టోబర్ 17 వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నది. ప్రతి శనివారం ఉదయం 10 నుంచి 11 వరకు ఈ శిక్షణ ఉంటుంది.

అద్భుతమైన ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతోపాటు, కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు నడిపిస్తున్న వ్యోమ్ క్రొత్తపల్లి తానా నాయకులు అభినందించారు. కరికులం రూపకల్పనలో మరియు కోఆర్డినేషన్‌లో రోహన్ గుండూరు కీలకపాత్ర పోషిస్తున్నారు. బిగినర్ లెవెల్ కోచింగ్‌కు మద్దతు ఇస్తూ ముందుకు నడిపిస్తున్న ప్రణవ్ కంతేటిని తానా నాయకులు అభినందించారు. అలాగే ఈ శిక్షణ కార్యక్రమానికి మెంటార్ గా వ్యవహరిస్తున్న జోషువా ఆండర్సన్‌కు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.






ఈ శిక్షణ తరగతుల ప్రారంభానికి ముందు ప్రోత్సాహకరమైన సందేశాన్నిందించి, విద్యార్థులందరిలో ఉత్సాహాన్ని నింపిన తానా బోర్డ్ డైరెక్టర్ రవి పొట్లూరి, ఈ కార్యక్రమంలో భాగస్వాములై, సెషన్‌కు తమ మద్దతు తెలిపిన తానా మిడ్-అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ ఫణి కంతేటి రంజిత్ మామిడి, మరియు ప్రసాద్ క్రొత్తపల్లిని తానా ఉన్నత నాయకత్వం అభినందించింది.



# ఛార్లెట్‌లో తానా విల్ అండ్ ట్రస్ట్ డ్రైవ్ విజయవంతం




ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఛార్లెట్ విభాగం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు, మరోవైపు కమ్యూనిటీకి ఎన్నో విషయాల్లో జాగ్రత్తలను తెలియజేస్తూ, చైతన్యపరిచే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా అక్టోబర్ 4వ తేదీన నిర్వహించిన 'విల్ అండ్ ట్రస్ట్ డ్రైవ్' విజయవంతంగా ముగిసింది. అనిశ్చిత పరిస్థితులలో కుటుంబాలకు ఆర్థిక, చట్టపరమైన భద్రతను కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోస్పర్ రైట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వారితో కలిసి తానా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఫైనాన్షియల్, బిజినెస్ విషయాల్లో మంచి అవగాహన ఉన్న జ్యోత్స్న గంట ఈ కార్యక్రమం ద్వారా విల్ అండ్ ట్రస్ట్ కు సంబంధించిన విషయాల్లో పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో 120మందికిపైగా పాల్గొని తమ సందేహాలను, ఇతర విషయాలను నివృత్తి చేసుకున్నారు. తమ వీలునామాలు సిద్ధం చేసుకోవడానికి, ముఖ్యమైన కుటుంబ పత్రాలను పూర్తి చేయడానికి ఈ కార్యక్రమం దోహదపడింది.

ఈ కార్యక్రమానికి మంచి స్పందన రావడం పట్ల ఛార్లెట్ తానా నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఛార్లెట్ తోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల నుండి అనేక కుటుంబాలు ఈ కార్యక్రమానికి హాజరయ్యాయి. ప్రతి ఒక్కరూ తమ పత్రాలను పూర్తి చేయడానికి సాయంత్రం వరకు వేచి ఉన్నారు. ఇది ఎప్పటి నుంచో వాయిదా పడుతున్న ఈ పనిని ఎట్టకేలకు పూర్తి చేయాలనే వారి పట్టుదలను తెలియజేసింది. ప్రజల నుండి వచ్చిన విపరీతమైన స్పందనతో, ప్రతి ఒక్కరూ తమ పత్రాలను పూర్తి చేసుకునేలా ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 7:30 గంటల వరకు నిర్వాహకులు పొడిగించారు.

ఈ కార్యక్రమంలో పలు కుటుంబాలకు నోటరీ సేవలను అందించిన సతీష్ జాస్తి మరియు కోటయ్య పచ్చల గారికి, రోజంతా ఈ కార్యక్రమానికి మద్దతుగా నిలిచి సహాయం చేసిన ప్రసాద్ చిగురుపాటి గారికి ప్రత్యేక ధన్యవాదాలును తెలియజేశారు. రేపటి మన కుటుంబాల భవిష్యత్తు మరియు భద్రత కోసం నేడు వేసే చిన్న అడుగు ఎంతో అర్థవంతమైన మార్పును తెస్తుందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. సేవా భావంతో కమ్యూనిటీ అంతా ఒకటై ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.




# విజయవంతంగా TANTEX 5కే వాక్/రన్, ఆరోగ్య అవగాహన, CPR శిక్షణతో పాటు కమ్యూనిటీ సేవకు ప్రాధాన్యత




తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (TANTEX) ఆధ్వర్యంలో అక్టోబర్ 3, నిర్వహించిన 5ఖ వాక్/రన్ కార్యక్రమం ఘనంగా, విజయవంతంగా జరిగింది. ఆరోగ్య అవగాహనతో పాటు కమ్యూనిటీ ఐక్యత, సేవా స్ఫూర్తిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా కమ్యూనిటీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో బ్లడ్ ప్రెజర్ మానిటరింగ్, BMI కొలతలు, CPR శిక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు వార్మప్ వ్యాయామాలు నిర్వహించగా, పాల్గొన్న వారందరికీ ఉచితంగా Pilates డెమోన్స్ట్రేషన్ కూడా అందించారు.

దక్షిణాసియా ప్రజల్లో గుండె సంబంధిత వ్యాధుల నివారణపై అవగాహన కల్పించేందుకు DFW ప్రాంతంలో పనిచేస్తున్న DilSe Program సంస్థ ఆధ్వర్యంలో CPR శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన DilSe Programకు TANTEX నాయకత్వం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అదేవిధంగా Club Pilates, East Frisco సంస్థ ఉచిత Pilates డెమోన్స్ట్రేషన్ నిర్వహించి కార్యక్రమానికి సహకరించింది. ఈ సహకారానికి TANTEX ధన్యవాదాలు తెలియజేసింది.

**స్పాన్సర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు:**

TANTEX 5K కార్యక్రమానికి టీ–షర్టుల స్పాన్సర్‌షిప్ అందించిన Nidhan Realty & Mortgage Services, White Lotus Dental మరియు Radico Wealth Partners సంస్థలకు TANTEX ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. పాల్గొన్న వారికి రుచికరమైన అల్పాహారాన్ని అందించిన Hello India, టీ అందించిన Desi Village, అలాగే రుచికరమైన లెమనేడ్స్ అందించిన The Creamery Stoneకు కూడా TANTEX కృతజ్ఞతలు తెలిపింది.

**పిల్లల ఉత్సాహభరితమైన భాగస్వామ్యం**

ఈ కార్యక్రమంలో పిల్లల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 20 మందికి పైగా పిల్లలు 5ఖ వాక్‌లో పాల్గొనడంతో పాటు, CPR కార్యక్రమాలకు వాలంటీర్లుగా సేవలందించారు. కమ్యూనిటీ ఆరోగ్యం మరియు సేవ పట్ల పిల్లలు చూపిన చొరవను [illegible] నాయకత్వం అభినందించింది. TANTEX Frisco Family Servicesకు 1,000 విరాళాన్ని అందించింది. ఫ్రిస్కోలో 30 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న ఈ లాభాపేక్షలేని సంస్థ, ఆకలి, నిరాశ్రయత్వం మరియు ఇతర అత్యవసర అవసరాలను ఎదుర్కొంటున్న Frisco ISD కమ్యూనిటీలకు సహాయం చేస్తూ, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడం మరియు స్వయం సమృద్ధి సాధించడంలో తోడ్పడుతోంది.

ఈ సందర్భంగా TANTEX నాయకత్వం మాట్లాడుతూ, "ఈ 5ఖ వాక్/రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన స్పాన్సర్లు, వాలంటీర్లు మరియు ప్రతి ఒక్క కమ్యూనిటీ సభ్యుడికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆరోగ్యం, సేవ మరియు కమ్యూనిటీ ఐక్యతను ప్రోత్సహించే కార్యక్రమాలకు TANTEX ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది.



# టాంటెక్స్ (TANTEX) 40వ వార్షికోత్సవ వేడుకల్లో అక్టోబర్ 24న మూడు ప్రత్యేక కార్యక్రమాలు




ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (TANTEX) తన 40వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా అక్టోబర్ 24, 2026 శనివారం నాడు తెలుగు సంస్కృతి, సాహిత్యం, సంగీతం మరియు సంప్రదాయాలను ప్రతిబింబించే మూడు ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనుంది.

ఈ కార్యక్రమాలన్నీ Frisco Flyers Event Center, 6300 Flyers Way, Frisco, TX 75034 వేదికగా జరుగనున్నాయి.

1. అట్లతద్ది వేడుకలు --- ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు

రోజువారీ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ అట్లతద్ది వేడుకలు నిర్వహించనున్నారు. తెలుగు మహిళల సంప్రదాయాలు, సంస్కృతి మరియు ఆచారాలను ప్రతిబింబించే ఈ వేడుకల్లో గౌరీ పూజ, గోరింటాకు, ఉయ్యాల, అట్ల వాయనం, కోలాటం ప్రదర్శనలు, అలాగే పలు వినోద కార్యక్రమాలు మరియు ఆకర్షణీయమైన బహుమతులు ఉంటాయి.

ఈ కార్యక్రమానికి బెజవాడ బేబక్క యాంకర్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమానికి RSVP తప్పనిసరి. ప్రవేశం ఉచితం.

2. 19వ వార్షికోత్సవం -- తెలుగు సాహిత్య వేదిక మధ్యాహ్నం 12:00 నుంచి సాయంత్రం 4:30 వరకు

తెలుగు భాష, సాహిత్యం మరియు సాంస్కృతిక విలువలను ప్రోత్సహించే తెలుగు సాహిత్య వేదిక 19వ వార్షికోత్సవం కూడా ఇదే వేదికపై నిర్వహించనుంది.

తెలుగు సాహిత్యాభిమానులను, రచయితలను, సాహితీవేత్తలను మరియు తెలుగు భాషాభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు మరియు వక్తల ప్రత్యేక ప్రసంగాలు, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

3. కోటి మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్

సాయంత్రం 5:00 నుంచి అర్ధరాత్రి వరకు

రోజంతా జరిగే వేడుకలకు ఘన ముగింపుగా ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు కోటి ఆధ్వర్యంలో "కోటి మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్" నిర్వహించనున్నారు.

ఈ సంగీత విభావరిలో సాయి శ్రీ చరణ్, నజీరుద్దీన్, శివాని పిసుపాటి, వైష్ణవి నన్నూరు తదితర ప్రతిభావంతులైన గాయకులు పాల్గొననున్నారు.

లైవ్ బ్యాండ్‌లో బాబు + గిటార్, దిలీప్ - బాస్, శ్రీధర్ వైద్యనాథన్ -కీబోర్డ్స్, కృష్ణ యమన్ - డ్రమ్స్ తమ సంగీత ప్రతిభను ప్రదర్శించనున్నారు.

ఈ కార్యక్రమానికి కేదార్ జోస్యుల మరియు గీతిక పిళ్లలమర్రి ఎంసీలుగా వ్యవహరించనున్నారు.

తెలుగు సంస్కృతి, సాహిత్యం, సంగీతానికి మహా వేదిక టాంటెక్స్ 40వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ మూడు కార్యక్రమాలు తెలుగు సంప్రదాయాలు, భాష, సాహిత్యం, సంగీతం మరియు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలవనున్నాయి.




ఉత్తర టెక్సాస్‌లో నాలుగు దశాబ్దాలుగా తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు, సమాజ సేవకు టాంటెక్స్ అందిస్తున్న సేవలను స్మరించుకుంటూ ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

తెలుగు కుటుంబాలు, సాహిత్యాభిమానులు, సంగీతప్రియులు మరియు ఉత్తర టెక్సాస్‌లోని తెలుగు సమాజం మొత్తం ఈ చారిత్రాత్మక 40వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని టాంటెక్స్ నిర్వాహకులు ఆహ్వానించారు.

వేదిక: Frisco Flyers Event Center

చిరునామా: 6300 Flyers Way, Frisco, TX 75034

తేదీ: శనివారం, అక్టోబర్ 24, 2026

ప్రవేశం: ఉచితం । పార్కింగ్: ఉచితం

మరిన్ని వివరాలకు: www.tantex.org

టాంటెక్స్ గవర్నింగ్ బోర్డు

మాధవి లోకిరెడ్డి -- అధ్యక్షురాలు

దీప్తి సూర్యదేవర -- ఈవెంట్ కోఆర్డినేటర్

దీపిక పేట -- వనితా వేదిక చైర్







# జపాన్ తెలుగు సమాఖ్య (JTS) ఆధ్వర్యంలో టోక్యోలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



జపాన్ తెలుగు సమాఖ్య (జీూ) ఆధ్వర్యంలో జపాన్ రాజధాని టోక్యోలోని కోమట్సుగావా పార్కులో బతుకమ్మ పండుగ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 200 మంది ఈ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొని, తెలంగాణ సంస్కృతీ వారసత్వంపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు."రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి మహిళలంతా ఒకచోట చేరి ఆడి పాడారు. దీంతో కోమట్సుగావా పార్కు వద్ద పండుగ శోభను సంతరించుకుంది. తెలుగు సమాఖ్య వాలంటీర్ లు సంబరాలలో పాల్గొన్న వారికి పులిహోర, మిఠాయిలు పంచి పెట్టారు. సమిష్టి కృషితో ఈ కార్యక్రమం విజయవంతం అయిందని అసోసియేషన్ ప్రతినిధి మురళీధర్ పేర్కొన్నారు.





# జపాన్ తెలుగు సమాజం (TAJ) ఆధ్వర్యంలో టోక్యో ఓజిమాలో ఘనంగా గణేష్ వినాయక చవితి వేడుకలు

జపాన్‌లోని తెలుగు సమాజానికి అండగా నిలుస్తున్న TAJ (Telugu Association of Japan) ఆధ్వర్యంలో టోక్యోలోని ఓజిమా ప్రాంతంలో గణేష్ వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, భారతీయ సంస్కృతి సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకల్లో తెలుగు కుటుంబాలతో పాటు స్థానిక జపాన్ ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొని, భారతీయ ఆధ్యాత్మికత, సంస్కృతి మరియు సంప్రదాయాలను ఆసక్తిగా వీక్షించారు. భారతీయులు, జపాన్ స్థానికులు కలిసి వినాయక చవితిని జరుపుకోవడం రెండు సంస్కృతుల మధ్య స్నేహం, సాంస్కృతిక పరస్పర అవగాహనకు ప్రతీకగా నిలిచింది.

భారతదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యోలో వినాయక చవితిని పురస్కరించుకుని వినాయకుడికి ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. “ఎక్కడ ఉన్నా మన సంస్కృతి మనతోనే” అనే భావనతో, జపాన్‌లోని తెలుగు కుటుంబాలు తమ పిల్లలకు భారతీయ సంస్కృతి, ఆచారాలు మరియు సంప్రదాయాలను పరిచయం చేస్తూనే, స్థానిక జపాన్ సమాజంతో సాంస్కృతిక అనుబంధాలను పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెలుగు సంస్కృతి, భారతీయ సంప్రదాయాలు, జపాన్ స్థానికుల భాగస్వామ్యం, భక్తి మరియు సమాజ ఐక్యత కలగలిసి వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.

కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబాలు, చిన్నారులు, TAJ సభ్యులు మరియు జపాన్ స్థానికులు పరస్పరం వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

జపాన్‌లో భారతీయ మరియు తెలుగు సంస్కృతిని కొనసాగిస్తూ, జపాన్ సమాజంతో స్నేహపూర్వక సాంస్కృతిక వారధులను నిర్మించడంలో TAJ కీలక పాత్ర పోషిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# అంతర్జాతీయ వేదికపై భారత విద్యార్థుల సత్తా.. ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లో 5 పతకాలు

అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐఓఏఏ) లో భారత విద్యార్థులు సత్తా చాటారు. వియత్నాంలో సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 5 వరకు జరిగిన 19వ అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో భారత బృందం నాలుగు స్వర్ణాలు, ఒక రజత పతకం సాధించింది. దీంతో పోటీల్లో పాల్గొన్న భారత బృందంలోని ప్రతి విద్యార్థి పతకం సాధించిన ఘనతను దక్కించుకున్నాడు.

ఈ ఒలింపియాడ్‌లో హైదరాబాద్‌కు చెందిన ప్రాంజల్ దీక్షిత్, దిల్లీకి చెందిన సుమంత్ గుప్తా, గురుగ్రామ్‌కు చెందిన అక్షత్ శ్రీవాస్తవ, ఫరీదాబాద్‌కు చెందిన అర్నావ్ సెహ్రావత్ స్వర్ణ పతకాలు సాధించారు. వడోదరకు చెందిన హర్షిల్ అమిత్‌కుమార్ పటేల్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. భారత్ నాలుగు స్వర్ణ పతకాలతో ఆతిథ్య దేశమైన వియత్నాంతో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచింది. ఇరాన్, దక్షిణ కొరియా చెరో ఐదు స్వర్ణ పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచాయి.

ఈ ఫలితాలతో అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లలో 2026వ సంవత్సరం భారత్‌కు ప్రత్యేకంగా నిలిచింది. ఈ ఏడాది వివిధ దేశాల్లో జరిగిన గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లలో భారత్ నుంచి పాల్గొన్న మొత్తం 24 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. వారిలో 16 మంది స్వర్ణ పతకాలు, ఎనిమిది మంది రజత పతకాలు గెలుచుకున్నారు.






# ఆస్టిన్ పాఠశాల - అద్భుతమైన పునఃప్రారంభం

ఆస్టిన్ పాఠశాల, విశ్వగురుకులం 2026--27 విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించాయి. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి తెలుగు కుటుంబాల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ సంవత్సరం ఆస్టిన్ తెలుగు కుటుంబాలు చూపించిన అపూర్వ స్పందన ప్రత్యేకంగా నిలిచింది. పాఠశాల స్వచ్ఛంద సేవకులు ఆస్టిన్ ప్రాంతంలోని తెలుగు కుటుంబాలను వ్యక్తిగతంగా సంప్రదించి, పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ప్రోత్సహించారు. దేశవ్యాప్తంగా అత్యధిక పాఠశాల నమోదులను సాధించిన నగరంగా ఆస్టిన్ నిలిచింది.

శ్వేత వేలగలేటి, రాజేష్ గంగబత్తిన, శ్రీదేవి కోట, రామ్‌శ్యామ్ భామిడిపాటి, వల్లి భామిడిపాటి, కీర్తి సుష్మిత బుద్ద, అనూష చిట్టూరి, వాసవి భవాన్నిమి ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు. వంశీ భారద్వాజ్, అర్జున్ కూర, శ్రీనివాస్ బత్తుల, మణి చెన్నుబట్ల స్వచ్ఛంద సేవకులుగా విశ్వగురుకులం కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

సహ అధ్యక్షురాలు రజని మారం ఆస్టిన్ పరిసర ప్రాంతంలో కార్యక్రమాల విస్తరణకు నాయకత్వం వహిస్తూ, తెలుగు కుటుంబాలను వ్యక్తిగతంగా కలుసుకుని మాతృభాష ప్రాధాన్యతను, మన భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యతను వివరించడంతో పాటు, కార్యక్రమాల నిర్వహణ, సమన్వయంలో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

విశ్వగురుకులం కార్యక్రమంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న రామ్ మారం, తరగతుల పునఃప్రారంభ వేడుకలో పాల్గొని, తల్లిదండ్రులకు పాఠశాల, గురుకుల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనమని, వాటి ప్రయోజనాలను మరింత మంది కి చేరేలా సహకరించాలని కోరారు.

తానా అధ్యక్షులు నరేంద్ర కొడాలి, డాక్టర్ నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి మరియు తానా కార్య వర్గం ఈ కార్యక్రమాల విజయానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ, మన తెలుగు భాషా, భారతీయ సంస్కృతులను ఉత్తర అమెరికా వ్యాప్తంగా భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్నారు.

# ఆస్ట్రేలియాలో తొలి మహిళా మేయర్‌గా.. కర్రి సంధ్యారెడ్డి





ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఓ తెలంగాణ మహిళ అరుదైన ఘనత సాధించారు. అత్యంత కీలకమైన స్ట్రాత్‌ఫీల్డ్ పురపాలక సంఘం మేయర్‌గా హైదరాబాద్‌కు చెందిన కర్రి సంధ్యారెడ్డి (శాండీ రెడ్డి) ఎన్నికయ్యారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ విజయంతో తెలంగాణ నుంచి ఆస్ట్రేలియాలో మేయర్‌గా ఎన్నికైన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. మేయర్‌గా సంధ్యారెడ్డి సెప్టెంబర్ 2028 వరకు పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా సంధ్యారెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గౌరవంగా భావిస్తున్నాను. ఇది ఒక పెద్ద బాధ్యత. కౌన్సిలర్లు, సిబ్బంది, ప్రజల సహకారంతో మన ప్రాంతాన్ని జీవించడానికి, పనిచేయ డానికి మరింత అద్భుతమైన ప్రదేశంగా మారుద్దాం అని తెలిపారు. సంధ్యారెడ్డి నేపథ్యం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌తో ముడిపడి ఉంది. ఆమె స్టాన్లీ కళాశాలలో ఇంటర్మీడియట్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తిచేశారు. 1991లో వివాహం అనంతరం భర్త కర్రిరెడ్డితో కలిసి ఆస్ట్రేలియాకు వలస వెళ్లి, అక్కడ ఇమిగ్రేషన్ న్యాయవాదిగా స్థిరపడ్డారు. కేవలం వృత్తికే పరిమితం కాకుండా, ఆమె స్థానిక సమాజ సేవలో చురుకుగా పాల్గొన్నారు. 2021లో స్వతంత్ర అభ్యర్థిగా కౌన్సిలర్‌గా ఎన్నికై, 2023లో డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె సేవలకు గుర్తింపుగా 2020లో స్ట్రాత్‌ఫీల్డ్ సిటిజన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు. బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి సంధ్యారెడ్డి బంధువు. ఆస్ట్రేలియా రాజకీయ చరిత్రలో ఓ తెలంగాణ మహిళ ఈ ఉన్నత స్థాయికి ఎదగడం ఇదే తొలిసారి. ఖండాంతరాల్లో తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటిన సంధ్యా రెడ్డికి ప్రవాస భారతీయుల నుంచి పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



# కెనడా మేయర్ బరిలో తెలుగు మహిళ

తెలంగాణ సంతతికి చెందిన దీపికా దామెర్ల కెనడాలోని మిసిసౌగా మేయర్ పదవికి పోటీచేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి దీపిక వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. హిందీ పాట క్యా హువా తేరా వాదా స్టైల్‌లో ఓటర్లకు ఆమె హామీలు ఇస్తున్నారు. ఆ పాట తరహాలో పేరడీ చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. తనను మిసిసౌగా మేయర్‌గా గెలిపిస్తే ఏమేం చేస్తానో వివరిస్తూ పలు హామీలు ఇచ్చారు. మిసిసౌగా మేయర్ పదవికి పోటీచేస్తున్న నన్ను గెలిపించండి. నేను మేయర్‌గా ఎన్నికైతే ప్రాపర్టీ ట్యాక్స్ పెంచను. ఆ పన్ను పెరగకుండా చూస్తాను. దయచేసి నాకు మద్దతు తెలిపి మేయర్‌గా గెలిపించండి. దీపికా దామెర్ల తెలంగాణలో సికింద్రాబాద్‌లో జన్మించారు. తర్వాత ఆమె కుటుంబం కెనడాకు వలస వెళ్లింది. టొరంటో యూనివర్సిటీలో రోట్‌మన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఆమె ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేశారు. ఎంబీఏ పూర్తిచేసిన తర్వాత కార్పొరేట్ బ్యాంకింగ్ రంగంలో కొంతకాలం పనిచేశారు. మిసిసౌగాలోనే ఓ వ్యాపారం కూడా నడిపారు. తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2018లో మిసిసౌగా సిటీ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. సిటీలోని ఏడో వార్డుకు ప్రాతినిధ్యం వహించారు. ఆ నగరంలో ఆమె దీర్ఘకాలంగా కమ్యూనిటీ లీడర్‌గానూ వ్యవహరించారు.

# భారత సంతతి మహిళకు నోబెల్ శాంతి బహుమతి

భారత సంతతి మహిళకు 2026 నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఈ యేటి నోబెల్ శాంతి బహుమతిని నవనీతం నావిపిళ్లై గెలుచుకున్నారు. ఓస్లోలోని నార్వేయన్ నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. శాంతి, అంతర్జాతీయ న్యాయ స్థాపన కోసం ఆమె తీవ్రంగా కృషి చేసినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సమితి హై కమీషనర్‌గా 2008లో నావి పిళ్లై నియమితులయ్యారు. 2008, సెప్టెంబర్ ఒకటో తేదీన ఆమె ఆ పోస్టును స్వీకరించారు. సమగ్రమైన ప్రపంచ న్యాయం కోసం ఆమె పోరాటం చేశారు. యుద్ధ నేరాలు, మానవాళిపై నేరాలు, ఊచకోత లాంటి కేసుల్లో కచ్చితంగా ప్రాసిక్యూషన్ అమలు చేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన పిళ్లై 1967లో తన స్వంత ప్రావిన్సు నాటల్‌లో ఆమె లా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తలకు గతంలో ఆమె డిఫెన్స్ అటార్నీగా చేశారు. రాబెన్ ఐలాండ్‌లో ఉన్న ఖైదీల హక్కుల కోసం ఆమె పోరాడారు. డర్బన్‌లో ఉన్న భారతీయ తమిళ కుటుంబంలో ఆమె జన్మించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఆమె లీగల్‌గా వాదించారు. నెల్సన్ మండేలాకు ఆమె సపోర్టు ఇచ్చారు. దక్షిణాఫ్రికాలోని నాటల్ యూనివర్సిటీ నుంచి బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారామె. న్యాయ పట్టాలో మాస్టర్స్‌తో పాటు హార్వర్డ్ వర్సిటీ నుంచి జురిడికల్ సైన్స్‌లో డాక్టరేట్ చేశారు. 1941లో నవనీతం పుట్టారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈక్వాలిటీ నౌ అనే అంతర్జాతీయ మహిళా హక్కుల సంస్థను ఆమె స్థాపించారు. క్వాజులు నాటల్ వర్సిటీలో లెక్చరర్‌గా చేశారు. డర్బన్ వెస్ట్‌విల్లే వర్సిటీలి వైస్‌ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. 1995లో దక్షిణాఫ్రికా హైకోర్టులో తాత్కాలిక జడ్జీగా చేశారు. ఆ ఏడాదిలోనే యూఎన్ జనరల్ అసెంబ్లీకి అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్‌కు జడ్జీగా ఎన్నికయ్యారు. రువాండాలో 8 ఏళ్లు చేశారు. రేప్, భావస్వేచ్ఛ కేసుల్లో వాదించారు. 2003లో హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు జడ్జీగా ఆమె నియమితులయ్యారు.



# డాలస్‌లో మహాత్మాగాంధీ మెమోరియల్ వద్ద అంగరంగ వైభవంగా.. గాంధీజీ 157వ జయంతి వేడుకలు



మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (ఎంజిఎంఎన్ టి) ఆధ్వర్యంలో గాంధీజీ 157వ జయంతి వేడుకలు అమెరికాలోని డాలస్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శాంతి నడక యాత్ర ప్రవాస భారతీయుల విశేష భాగస్వామ్యంతో శోభాయమానంగా సాగింది. ఈ కార్యక్రమానికి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల హాజరై ప్రసంగించారు. గత 12 సంవత్సరాలుగా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ పార్కులో శాంతి యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షం కారణంగా వాతావరణం అనుకూలించకపోయినా, వందలాది మంది ప్రవాస భారతీయులు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అందరికీ స్వాగతం పలికారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇర్వింగ్ డిప్యూటీ మేయర్ మార్క్ క్రోనన్వెట్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధిలో ఎన్ఆర్ఐల కృషి అభినందనీయమని కొనియాడారు. అమెరికాలోనే అతిపెద్ద గాంధీ మెమోరియల్ ఇక్కడ ఉండటం తమ నగరానికే గర్వకారణమని పేర్కొంటూ గాంధీజీకి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కాపెల్ సిటీ కౌన్సిల్ మెంబర్ రమేష్ ప్రేమకుమార్, భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ అందించిన నాయకత్వాన్ని స్మరించుకుంటూ పుష్పాంజలి ఘటించారు.

మహాత్మాగాంధీ మెమోరియల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ ప్రపంచమంతా యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రస్తుత సమయంలోనూ గాంధీజీ సిద్ధాంతాలు, అహింసా మార్గం ఎంతో ఆచరణీయమని నొక్కిచెప్పారు. శాంతియుత ప్రతిఘటనతో ఎంతటి శక్తినైనా ఎదిరించవచ్చని ప్రపంచానికి చూపిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని కొనియాడారు. అమెరికా పౌరహక్కుల నేత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, దక్షిణాఫ్రికా నేత నెల్సన్ మండేలా వంటి ఎందరో జగద్విఖ్యాత నాయకులు గాంధేయ మార్గం నుంచే ప్రేరణ పొందారని గుర్తుచేశారు. ఐక్యరాజ్యసమితి సైతం అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించడమే ఆయన తాత్విక చింతనకు ఉన్న సార్వజనీనతకు నిదర్శనమన్నారు. ప్రముఖ గాంధేయవాది, బోర్డు సభ్యులు డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్ రచించిన ద పెరల్స్ ఆఫ్ గాంధీజీస్ విజ్డమ్ గ్రంథాన్ని డిప్యూటీ మేయర్ మార్క్ క్రోనన్వెట్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియా అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఉపాధ్యక్షులు దీపక్ కాల్రా, బోర్డు సభ్యులు రావు కల్వాల, తయాబ్ కుండావాల, రాంకీ చేబ్రోలు, శైలేష్ షా, స్వాతీ షా, ముర్తుజ, కలై కృష్ణ, వినోద్ ఉప్పు, శాంటే చారి, డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అతిథులను ఘనంగా సత్కరించిన అనంతరం, శాంతికి ప్రతీకగా 10 శ్వేత కపోతాలను (తెల్ల పావురాలు) ఆకాశంలోకి ఎగురవేశారు.

# స్విట్జర్లాండ్‌లో బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన మండలి చైర్మన్, సభాపతి

విదేశాల్లో స్థిరపడినప్పటికీ మాతృభాషను, సంస్కృతి సంప్రదాయాలను మరువకుండా కాపాడుతుండటం అందరూ హర్షించదగ్గ విషయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బతుకమ్మ, బోనాలు వంటి ఉత్సవాలను నిర్వహిస్తూ భాషా సంస్కృతిని స్విట్జర్లాండ్‌లో ఇనుమడింపజేయడం భావితరాలకు ఆదర్శమన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్‌లోని బెర్న్ సిటీలో పర్యటించింది. ఈ సందర్భంగా స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ అధికారిక వెబ్‌సైట్ ను, ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. స్విట్జర్లాండ్‌లో నిర్మించబోయే వేంకటేశ్వరస్వామి దేవాలయం గురించి అక్కడి తెలుగు సంఘం ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు, స్విట్జర్లాండ్ తెలుగు సంఘం అధ్యక్షుడు కిరణ్ వేదాంతం, కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు. అంతకుముందు బెర్న్ సిటీలో ఉన్న చారిత్రాత్మక పార్లమెంట్ భవనాన్ని తెలంగాణ శాసన వ్యవస్థ బృందం సందర్శించింది. స్విట్జర్లాండ్ పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, శాసనసభల పనితీరు, చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజా ప్రతినిధుల బాధ్యతలు వంటి అంశాలపై చర్చించారు.






# సామాజిక సేవలో టీఎస్ఎన్ యువత ముందడుగు

అమెరికాలో తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (టీఎస్ఎన్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19న ఒమాహాలోని సీయెనా ఫ్రాన్సిస్ హౌస్ లో నిర్వహించిన ఫీడ్ ది నీడ్ యూత్ ఛారిటీ ఒ ఫుడ్ డ్రైవ్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 400కు పైగా భోజనాలను అవసరంలో ఉన్న వారికి వడ్డించారు. యువతతో పాటు వారి కుటుంబ సభ్యులు, టీఎస్ఎన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు. టీఎస్ఎన్ అధ్యక్షులు కొల్లి , ఛారిటీ కమిటీ అధ్యక్షులు ధనారావు గొట్టిపాటి, కమ్యూనిటీ కమిటీ అధ్యక్షులు అవినాష్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమన్వయంతో కార్యక్రమం జరిగింది. భోజన సేవతో పాటు యువతకు అక్కడి జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిచయం చేసేందుకు ప్రత్యేక ఫెసిలిటీ టూర్ ఏర్పాటు చేశారు. టీఎస్ ఎన్ అధ్యక్షులు కొల్లి విజ్ఞప్తి మేరకు మహిళలు, పురుషుల షెల్టర్ విభాగాలు, నివాస ప్రాంతాలు, లాండ్రీ ఫెసిలిటీస్, తదితర ప్రదేశాలను యువతకు సియెనా ఫ్రాన్సిస్ హౌస్ చైర్ మిసెస్ లిల్లీ చూపించారు. అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన యువత, తమకు తల్లిదండ్రులు, కుటుంబం, నివసించేందుకు ఇల్లు ఉండటం ఎంత అదృష్టమో భావోద్వేగంతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఒక యువ వాలంటీర్ నేను పెద్దయ్యాక వీరు అనుభవిస్తున్న బాధను తగ్గించగల పరిష్కారాన్ని కనుగొనాలని ఉంది అని చెప్పడం మిగతా యువతను కూడా కదిలించింది.

తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు యువతలో సేవాభావం, సానుభూతి, కృతజ్ఞత, సామాజిక బాధ్యత పెంపొందించడం టీఎస్ఎన్ లక్ష్యాల్లో ఒకటని నిర్వాహకులు తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో ప్రతి త్రైమాసికంలో ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి మరింత మంది యువతను భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. సేవను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా, జీవితాంతం కొనసాగించే విలువగా యువత స్వీకరించాలన్నదే ఫీడ్ ద నీడ్ కార్యక్రమం అందించిన సందేశం.

# నాట్స్ 'అడాప్ట్ ఎ పార్క్ కార్యక్రమం




భాష రమ్యం సేవే గమ్యం అంటూ ముందుకు సాగుతున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం తాజాగా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, సేవాభావాన్ని పెంచేలా అడాప్ట్ ఎ పార్క్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించింది. ఫ్రిస్కో నగరంలోని 'మొనార్క్ వ్యూ పార్క్' వేదికగా నిర్వహించిన 'అడాప్ట్ ఎ పార్క్' లో విద్యార్థులు, నాట్స్ సభ్యులు పాల్గొన్నారు. 'సిటీ ఆఫ్ ఫ్రిస్కో' భాగస్వామ్యంతో మొనార్క్ వ్యూ పార్క్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, పార్క్ నిర్వహణను మెరుగుపరిచేందుకు నాట్స్ ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే జరిగిన ఈ తాజా కార్యక్రమంలో స్థానిక తెలుగు వారు ముఖ్యంగా ఇరవై మందికి పైగా చిన్నారులు ఉత్సాహంగా పాలుపంచుకుని పార్క్ పరిసరాలను శుభ్రపరిచారు. చిన్ననాటి నుంచే పిల్లలలో సేవా దృక్పథం, సామాజిక బాధ్యత , పర్యావరణ స్పృహ పెంపొందించేలా నాట్స్ చేపట్టిన ఈ వినూత్న ప్రయత్నం స్థానికుల నుంచి ఎంతో ప్రశంసలు అందుకుంది.

ఈ సేవా కార్యక్రమంలో నాట్స్ డల్లాస్ చాప్టర్ కోఆర్డినేటర్లు కిరణ్ నారె, పావని నున్నలతో పాటు డల్లాస్ బృందం సభ్యులు బదరి బియ్యపు, నరేన్ శివ, హృదయ్ దండు, రోహిత్ సుంకర, రవి తాంద్ర, విశాలాక్షి నారె, దీపిక నిడిగంటి తదితరులు పాల్గొన్నారు. అలాగే డల్లాస్ చాప్టర్ యూత్ జట్టు నుండి ధృవ్ పెదిరెడ్ల, వేద నిడిగంటి, అద్వైత్ నారె, అర్ణవ్ నారె తదితరులు ఉత్సాహంగా శ్రమదానం చేశారు. మరోవైపు, నాట్స్ జాతీయ నాయకత్వం నుంచి జోనల్ వైస్ ప్రెసిడెంట్ రత్నాకర్ సెట్టిపల్లి, నేషనల్ మీడియా రిలేషన్స్ కోఆర్డినేటర్ శ్రవణ్ నిడిగంటి, ఎగ్జిక్యూటివ్ వెబ్ సెక్రటరీ కిషోర్ నారె లు ఈ కార్యక్రమానికి విచ్చేసి స్వయంగా పర్యవేక్షించారు.

ఫ్రిస్కో నగరంలో 'అడాప్ట్ ఎ పార్క్' కార్యక్రమాన్ని నిరంతరం విజయవంతంగా కొనసాగిస్తూ, కమ్యూనిటీ సేవలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటున్న నాట్స్ డల్లాస్ చాప్టర్ జట్టును నాట్స్ బోర్డ్ చైర్మన్ కిషోర్ కంచర్ల, నాట్స్ ప్రెసిడెంట్ రాజ్ అల్లాడ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో డల్లాస్ పరిసర ప్రాంతాల్లోని చిన్నారులు యువతను మరింత పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు డల్లాస్ చాప్టర్ కోఆర్డినేటర్లు కిరణ్ నారె, పావని నున్న వెల్లడించారు. ఈ బృహత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్క వాలంటీర్‌కు, పిల్లలకు మరియు వారి తల్లిదండ్రులకు నాట్స్ నాయకత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

# రియాద్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

రియాద్‌లో సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) ఆధ్వర్యంలో సీజన్-5 తెలుగు భాషా దినోత్సవం, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత రాయబారి విపుల్ ముఖ్యఅతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు ప్రవాస తెలుగు సమాజానికి సామాజిక సేవలు అందించడమే లక్ష్యంగా సాటా గత ఐదేళ్లుగా పనిచేస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటివరకు 300కు పైగా వ్యక్తులు, కుటుంబాలకు వివిధ సందర్భాల్లో సహాయం అందించినట్లు వెల్లడించారు. అత్యవసర వైద్యం, చిన్నారుల చికిత్స, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు అవసరమైన సమయంలో సమాజం నుంచి సహాయాన్ని సమీకరిస్తున్నట్లు వివరించారు. సాటా కార్యకలాపాలకు కోర్ కమిటీ, కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు, దాతలు, స్పాన్సర్లు, తెలుగు సమాజ సభ్యుల సహకారం కీలకంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకుండా, సౌదీ అరేబియాలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు అవసరమైన సమయంలో తోడుగా నిలిచే సామాజిక వేదికగా సాటా ఎదిగిందని తెలిపారు. సాటా వ్యవస్థాపకులు ఆనందరాజు గుండుబోగుల, రంజిత్ చిత్తులూరి, ముజమ్మిల్ షేక్ గత ఐదేళ్లుగా చేస్తున్న కృషిని భారత రాయబారి విపుల్ ప్రత్యేకంగా అభినందించారు. వారి దూరదృష్టి, అంకితభావం, సేవా స్ఫూర్తితో ప్రారంభమైన సంస్థ నేడు సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికగా ఎదగడం అభినందనీయమని పేర్కొన్నారు. సామాజిక సేవలతో పాటు తెలుగు భాష, సాహిత్యం, సంగీతం, కళలు, పండుగలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసేందుకు సాటా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సీజన్-5 వేడుకల్లో ప్రముఖ గాయకులు రఘు కుంచె, హారిక నారాయణ అందించిన సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన తెలుగు కుటుంబాలు ఒకే వేదికపైకి వచ్చాయి. తెలుగు భాషా దినోత్సవంతో పాటు సౌదీ అరేబియా జాతీయ దినోత్సవ స్ఫూర్తిని కూడా కార్యక్రమంలో ప్రతిబింబించారు. ఆతిథ్య దేశమైన సౌదీ అరేబియా పట్ల గౌరవం, భారతీయ సంస్కృతి పట్ల గర్వం, విభిన్న సంస్కృతుల మధ్య పరస్పర గౌరవం, స్నేహభావం వంటి సందేశాలను ఈ వేడుకలు చాటిచెప్పాయని నిర్వాహకులు తెలిపారు.





# మహాశివ రాత్రికి విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక సోషియో ఫాంటసీ విజువల్ వండర్ ' విశ్వంభర ' రిలీజ్‌పై టాలీవుడ్ వర్గాల్లో కొన్నాళ్లుగా సాగుతున్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే షూటింగ్ ముగించుకుని, పోస్ట్ ప్రొడక్షన్ పరంగా గుమ్మడికాయ కొట్టేసిన ఈ భారీ బడ్జెట్ చిత్రం ఎప్పుడు థియేటర్లలోకి అడుగుపెడుతుందనేది అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది. తాజా ఫిలింనగర్ సమాచారం ప్రకారం ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను 2027, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. నిజానికి గతంలో వచ్చిన వార్తల ప్రకారం ఈ ప్రాజెక్ట్ చాలా ముందుగానే వెండితెరపై సందడి చేయాల్సి ఉంది. అయితే సోషియో ఫాంటసీ నేపథ్యంలో సాగే కథ కావడంతో, వెండితెరపై విజువల్స్ అత్యంత సహజంగా, అద్భుతంగా ఉండాలనే పట్టుదలతో నిర్మాతలు వ్యవహరించారు. హాలీవుడ్ స్థాయి అత్యుత్తమ కంప్యూటర్ గ్రాఫిక్స్ నిపుణులను రంగంలోకి దించి, విజువల్ ఎఫెక్ట్స్ పనులను పూర్తి చేయించారు. ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకపోవడం వల్లే అనుకున్న షెడ్యూల్స్ కంటే చాలా ఆలస్యమైంది. ప్రస్తుతం ఫైనల్ కాపీ సిద్ధంగా ఉన్నప్పటికీ, సినిమా స్థాయికి తగ్గ బాక్సాఫీస్ గ్రౌండ్, కలెక్షన్ల పరంగా తిరుగులేని సోలో విండో దొరకాలన్నదే టీమ్ ఉద్దేశం.

# రాయలసీమ వీరులగాథ...రణబాలి



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' . టీ సిరీస్ సమ-ర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబరు 16న 'రణబాలి'ని తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఇది 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోన్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ అతుల్ సంగీతం అందిస్తున్నారు. పెళ్లి తర్వాత విజయ్-రష్మిక జోడీగా నటిస్తున్న సినిమా కావడం, 'ది మమ్మీ'లో విలన్‌గా చేసిన ఆర్నాల్డ్ ప్రతినాయకుడిగా చేస్తుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఇందులోని 'క్లైమాక్స్' సినిమాకు ప్రాణమని దర్శకుడు రాహుల్ ఇటీవల పంచుకున్నారు. కేవలం ఆ ఫైట్ కోసమే 16 రోజులు షూటింగ్ చేశారట. అందులోని డ్రామా, విజయ్-ఆర్నాల్డ్ మధ్య ఫైట్ అద్భుతంగా ఉంటుందని చెప్పారు. దసరా పండగ సందర్భంగా విడుదల కాబోతున్న సినిమాల్లో రణబాలి మీద భారీ అంచనాలున్న సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నిజ జీవిత భార్యా భర్తలయ్యాక రిలీజవుతున్న మొదటి మూవీగా అభిమానులు చాలా స్పెషల్ గా ఫీలవుతున్నారు. దానికి తగ్గట్టే ఈ జంట ప్రమోషన్ వీడియోలలో తమ బంధం ఎంత బలంగా ఉందో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బడ్జెట్ దృష్ట్యా దీనికి టికెట్ రేట్ల పెంపు తీసుకుంటారనే ప్రచారం హఠాత్తుగా మొదలయ్యింది. దీనికి మైత్రి మూవీ మేకర్స్ స్పందిస్తూ ఎలాంటి హైక్స్ ఉండవని, రెగ్యులర్ ధరలకే గొప్ప అనుభూతిని పొందవచ్చని హామీ ఇచ్చారు.



# జైలర్ 2 మరో సంచలనం ?



సూపర్ స్టార్ రజినీకాంత్ కమ్ బ్యాక్ మూవీ 'జైలర్' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో తెలిసిందే. ఇప్పుడు దానికి సీక్వెల్ గా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న 'జైలర్ 2' దసరా కానుకగా వస్తోంది. అక్టోబర్ 15, 2026న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల కాబోతున్న ఈ సినిమా కేవలం రజనీకాంత్ ఫ్యాన్స్‌ను మాత్రమే కాకుండా యావత్ సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. జైలర్ లో కేవలం శివన్న నటిస్తే అంచనాలు పీక్స్‌కి చేరిన విషయం తెల్సిందే. ఇప్పుడు కన్నడ సూపర్ స్టార్ శివన్న మాత్రమే కాకుండా మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ సైతం జైలర్ 2 లో కనిపించబోతున్నాడు. జైలర్ 2 ట్రైలర్ విడుదల తర్వాత మొత్తం పరిస్థితి మారిపోయింది. సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా పెరిగాయి. టాలీవుడ్ ప్రేక్షకులు, హిందీ ప్రేక్షకులు సైతం జైలర్ 2 ను థియేటర్‌లో ఎప్పుడు చూస్తామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత కొంత కాలంగా ప్రచారం జరుగుతున్నట్లుగా కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్, మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్‌లు సినిమాలో కనిపించబోతున్నారు. ఇక సినిమాలో ప్రముఖ దర్శకుడు, నటుడు ఎస్ జే సూర్య సైతం కనిపించబో తున్నాడు. ఇంకా బాలీవుడ్ నటి విద్యా బాలన్ సైతం సినిమాలో కీలక పాత్రలో కనిపించబోతున్న నేపథ్యంలో అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా దర్శకుడు నెల్సన్ దిలీప్ జైలర్ 2 ను రూపొందించాడని ట్రైలర్ చూస్తే అనిపిస్తుంది. ఇక సినిమాలో బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ కనిపించబోతున్నాడు, ఆయన గెస్ట్ అప్పియరెన్స్‌కి బాలీవుడ్ ప్రేక్షకులు సర్‌ప్రైజ్ కావడం ఖాయం అని చిత్ర యూనిట్ సభ్యులు ఆఫ్ ది రికార్డ్ చెబుతూ వస్తున్నారు. ఫైనల్‌గా ట్రైలర్ వచ్చింది, ట్రైలర్‌లో శివన్న, మోహన్ లాల్‌లు కనిపించారు కానీ హృతిక్ ఎక్కడ అంటూ చాలా మంది ప్రశ్నిస్తున్నారు.

SUPADHA™
CREATING LANDMARKS

# ఆధునిక సౌకర్యాలు విలాసవంతమైన జీవనానికి చిరునామా

# 'సుపథ గమ్య'

GAMYA™
TOGETHERMENT HOMES AT TELLAPUR





హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఎన్నో ప్రాజెక్టులు ప్రత్యేకమైన ఆకర్షణలతో కస్టమర్లను ఆకట్టుకునేలా నిర్మాణాలను జరుపుకుంటు న్నాయి. అందులో భాగంగా హైదరాబాద్‌లోని తెల్లాపూర్ – ఉస్మాన్ నగర్ రోడ్డులో "సుపథ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్' అత్యంత విలాసవంతమైన హైరైజ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ "సుపథ గమ్య"ను నిర్మిస్తోంది. 10.12 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌లో 36 అంతస్తులతో కూడిన 6 టవర్లు ఉన్నాయి. ఇందులో 2,430 నుండి 3,855 చదరపు అడుగుల వైశాల్యంతో 1,008 అత్యంత ఆకర్షణీయమైన, సువిశాలమైన 3, 4 బిహెచ్‌కే అపార్ట్‌మెంట్లను అందుబాటులోకి తెస్తున్నారు. 80 శాతానికి పైగా ఖాళీ స్థలం (ఓపెన్ స్పేస్), వాహనాల రద్దీ లేని ప్రశాంతమైన పోడియం మరియు కంటికి ఇంపుగా ఉండే గ్రీన్ ల్యాండ్‌స్కేప్‌లతో ఈ ప్రాజెక్ట్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మరియు హైటెక్ సిటీ వంటి ప్రధాన ఐటీ ప్రాంతాలకు అనుకూలమైన స్థలంలో నిర్మితమవుతోంది. సులభమైన రవాణా సౌకర్యం ఉంది.

సుపథ డెవలపర్స్ అనేది హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ. ఇది సుపథ ఇన్ఫ్రా, సుపథ డెవలపర్స్ డెవలపర్స్, మరియు సుపథ డెవలపర్స్ కన్స్ట్రక్షన్స్ అనే మూడు విభాగాల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగి ఉన్న పరిశ్రమ. హైదరాబాద్‌లో గేటెడ్ విల్లా కమ్యూనిటీల భావనను ప్రవేశపెట్టడంలో వీరు మార్గదర్శకులుగా నిలిచి, నగర నివాస రూపానికి గణనీయమైన రూపాన్ని ఇచ్చారు. ఆధునిక డిజైన్లతో కూడిన నివాసాలు, సకాలంలో ప్రాజెక్ట్‌ల పూర్తి, పారదర్శకత మరియు క్లయింట్ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రధాన లక్ష్యాలుగా ఈ సంస్థ పనిచేస్తోంది. 'సుపథ గమ్య'" కాకుండా హైదరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాలలో విల్లాలు, హైరైజ్ అపార్ట్‌మెంట్లు వంటి పలు నివాస ప్రాజెక్ట్‌లను ఈ సంస్థ చేపట్టింది.






## ప్రాజెక్ట్ ముఖ్యాంశాలు

- ❖ విస్తీర్ణం: 10.12 ఎకరాలు
  మొత్తం టవర్లు: 6 టవర్లు (ప్రతి టవర్‌లో 36 అంతస్తులు)
- ❖ మొత్తం ఫ్లాట్లు: 1,008 అపార్ట్‌మెంట్లు, ప్రతి ఫ్లాట్ కార్నర్ ఫ్లాట్‌గా వెలుతురు, గాలి బాగా వచ్చేలా డిజైన్ చేయబడింది.
- ❖ ఫ్లాట్ రకాలు: 3 బెడ్ రూముల సైజులు 2,430, 2,605 మరియు 2,810 చదరపు అడుగులు
- ❖ 4 బెడ్‌రూముల సైజులు 3,475 మరియు 3,855 చదరపు అడుగులు
- ❖ కనెక్టివిటీ: ఔటర్ రింగ్ రోడ్డుకి అతి సమీపంలో ఉండటం వల్ల శంషాబాద్ విమానాశ్రయం మరియు నగరంలోని ఇతర ప్రాంతాలకు వేగంగా చేరుకోవచ్చు. ప్రముఖ అంతర్జాతీయ పాఠశాలలు, మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రులు, షాపింగ్ మాళ్లు మరియు రెస్టారెంట్లు సమీపంలోనే ఉన్నాయి.

**ఆధునిక సౌకర్యాలు**

- ❖ విశాలమైన క్లబ్‌హౌస్: స్విమ్మింగ్ పూల్, జిమ్, ఇండోర్ గేమ్‌లు, బ్యాంక్వెట్ హాల్.
- ❖ 74,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు విలాసవంతమైన క్లబ్‌హౌస్‌లు (లీజర్ మరియు స్పోర్ట్స్ కోసం)
- ❖ టెంపరేచర్-కంట్రోల్డ్ స్విమ్మింగ్ పూల్, రూఫ్‌టాప్ ఫుట్‌బాల్ ఏరియా, జిమ్, యోగా లాన్స్.
- ❖ కార్-ఫ్రీ పోడియం: ప్లాజా లెవల్‌లో వాహనాలు తిరగకుండా సురక్షితమైన నడక మార్గాలు మరియు పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక స్థలాలు.
- ❖ క్రీడా సౌకర్యాలు: బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ మరియు టెన్నిస్ కోర్టులు.
- ❖ ప్రకృతి వాతావరణం: 80% కంటే ఎక్కువ ఖాళీ ప్రదేశం, 3 ఎకరాల హరిత స్థలం (Green Space) మరియు వెహికల్-ఫ్రీ వాకింగ్ జోన్లు.
- ❖ సీనియర్ సిటిజన్ పార్కులు, వాకింగ్ / జాగింగ్ ట్రాక్‌లు మరియు పచ్చని ల్యాండ్‌స్కేప్ గార్డెన్లు.
- ❖ భద్రత: 24/7 సిసిటివి నిఘా మరియు మూడంచెల భద్రతా వ్యవస్థ.

**For More Details Call: +91 88795 55111 / 222**
**visit: https://supadha.in/gamya/**


ASBL
LEGACY
1ST FULLY GATED COMMUNITY OF
RTC X ROADS
STARTS FROM
₹6,999 /SQ. FT.
WITH
ONE TIME PAYMENT
OTP
INFINITY SWIMMING POOL
INDOOR & OUTDOOR GYM
INDOOR BADMINTON COURT
INDOOR GAMES
KIDS PLAY AREA
THE FESTIVAL LAWN
& MANY MORE
LUXURY 3 & 4 BHKs
1970 - 3015 SQ.FT
3 TOWERS
G+50 FLOORS
1,70,000 + SQ. FT.
WORLD CLASS AMENITIES
73.25%
OPEN SPACE
ASBL
HMDA Building Permission No: 018053/HMDA/04527/SWBP/GHMC/2026
TG RERA Registration No: P02500011162 | Website : https//:rera.telangana.gov.in
CONTACT
+91 928 959 6889
WEBSITE
asbl.in/legacy